



RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 10

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 6 జూన్ 2026

## రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యం

- స్వచ్ఛతకు, పచ్చదనానికి ఏయూ ఆదర్శం కావాలి
- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్న సీఎం చంద్రబాబు
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏయూలో మొక్క నాటిన సీఎం
- స్టీల్ సిటీలో సీఎం సైకిల్ సవారీ - ఐదున్నర కి.మీ. ప్రయాణం





**విశాఖపట్నం,కలంకౌంటర్ :** రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రోజురోజుకూ పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని... ఓవైపు విపరీతమైన ఎండలు, లేదంటే తుఫానులు వస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం ముఖ్యమంత్రి పాల్గొన్నారు. శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు దీనికి హాజరయ్యారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏయూ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి మొక్క నాటారు. తిరుమల తరహాలో ఏయూ క్యాంపస్‌లోనూ గ్రీనరీ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం క్యాంపస్‌లో 25 శాతమే గ్రీనరీ ఉందని... దీనిని 50 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలంటూ ఏయూ వీసీని సీఎం ఆదేశించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ... 'స్వచ్ఛత, పచ్చదనం, పర్యావరణానికి ఏయూ క్యాంపస్ ఆదర్శంగా మారాలి. నెట్ జీరో క్యాంపస్‌గా ఏయూను నిలపాలి. ఆంధ్ర యూనివర్శిటీకి 450 ఎకరాల సువిశాల క్యాంపస్ ఉంది. ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెంచడంతో పాటు... బిల్డింగుల మీద సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. క్యాంపస్‌కు అవసరమైన విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలి. ఇప్పటికే రూ.5,18,000 విలువైన విద్యుత్ ఆదా అయింది. క్యాంపస్ ను బయో డైవర్సిటీ పార్కుగా తీర్చిదిద్దాలి. హాస్టళ్లు, కాలేజీల నుంచి వచ్చే చెత్త, చెట్ల ఆకులను కంపోస్ట్‌గా మార్చాలి. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, వ్యర్థాల నుంచి బయో గ్యాస్ ఉత్పత్తిపై దృష్టి పెట్టాలి. వేస్ట్ వాటర్ మేనేజ్మెంట్ చేపట్టాలి. క్యాంపస్ నుంచి ఒక్క చుక్క నీరు కూడా బయటకు వెళ్లకూడదు. శుద్ధి చేసిన నీటిని చెట్లకు ఉపయోగించాలి. పీఎన్జీ, ఎలక్ట్రికల్ స్టవ్స్ వంటలకు వినియోగించుకోవాలి. నెట్ జీరో విధానం అమలు చేయడానికి ప్రొఫెసర్స్ టీం ఏర్పాటు చేయాలి. పర్యావరణానికి సంబంధించి విద్యార్థులకు ఏయూ క్యాంపస్ ఓ నాలెడ్జ్ హబ్‌గా తయారవ్వాలి. ప్రపంచంలోని టాప్ నాలెడ్జ్ వర్సిటీల సరసన ఏయూను నిలపాలి. క్యాంపస్ లోపల ఎలక్ట్రికల్ సైకిళ్లను అందుబాటులోకి తీసుకురావాలి.' అన్నారు.

**విశాఖలో కాలుష్య నియంత్రణ చర్యలు..** విశాఖలో కాలుష్యాన్ని తగ్గించేందుకు పోర్టు దగ్గర నుంచి మొదలుకుని అన్ని ప్రాంతాల్లోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లంటూ సీఎం సరదాగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 2.5 కోట్ల సీడ్ బాల్స్‌తో గ్రీనరీ పెంచేలా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని చెప్పారు. విశాఖలో సైక్లింగ్, వాకింగ్ కోసం ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేస్తామన్నారు. సైక్లింగ్ ద్వారా రెండు విధాలుగా లాభం ఉందని... కాలుష్యం తగ్గడమే కాకుండా ఫిట్?నెస్ పెంచుకోవచ్చని సీఎం అన్నారు.

**సీఎం సైకిలింగ్...** ఏయూ గ్రౌండ్స్ లో నిర్వహించిన మీడియా సమావేశం అనంతరం... పర్యావరణ పరిరక్షణపై అందరిలో చైతన్యం

- 2లో

## లోక్ భవన్ లో మొక్కను నాటిన గవర్నర్ అబ్దుల్ నజీర్



**విజయవాడ,కలంకౌంటర్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ శుక్రవారం ఇక్కడ లోక్‌భవన్ ఆవరణలో ఎర్ర జామ మొక్కను నాటారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ, పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతలు, తీవ్రమైన వాతావరణ పరిస్థితులు, పర్యావరణ క్షీణతను తగ్గించడానికి చర్యలను వేగవంతం చేయడంపై ప్రాథమికంగా దృష్టి సారించాలని కోరారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని 'ప్రకృతి స్ఫూర్తితో. వాతావరణం కోసం. మన భవిష్యత్తు కోసం' అనే ఇతివృత్తంతో జరుపుకుంటున్నామని అన్నారు. పర్యావరణ పరిరక్షణ మరియు సుస్థిర జీవనంపై అవగాహన పెంచడానికి నిర్వహించే ప్రచారంలో ప్రతి ఒక్కరూ భాగం కావాలని గవర్నర్ కోరారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ సంయుక్త కార్యదర్శి పి.ఎస్. సూర్య ప్రకాష్, ఉప కార్యదర్శి రఘు, లోక్‌భవన్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## విత్తనాల బంతులతో పచ్చదనం పెంపొందించుదాం

- విత్తనాల బంతులు తయారీకి గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ శిక్షణ
- రాష్ట్ర వ్యాప్తంగా ఇరవై రోజులుగా శిక్షణా కార్యక్రమాలు
- గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ కృషి కి అభినందనలు
- కొణిదెల పవన్ కళ్యాణ్, డిప్యూటీ సీఎం, ఆంధ్రప్రదేశ్



**ఎన్టీఆర్ జిల్లా, కొండపల్లి,కలంకౌంటర్ :** విత్తనాల బంతులతో పచ్చదనం పెంపొందించుదాం అని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ అన్నారు. శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా, కొండపల్లి సమీపంలోని మూలపాడు బటర్ ఫ్లై పార్క్ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ తన తల్లి అంజనా దేవి పేరిట కొండపల్లి బొమ్మల తయారీలో వినియోగించే తెల్ల పొణికి మొక్క నాటి వేడుకలు ప్రారంభించారు. ఆలాగె ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారి "మా కే నామ్ ఏక్ పేడ్" నినాద స్ఫూర్తితో ప్రతి ఒక్కరు తమ మాతృమూర్తి పేరిట ఒక మొక్క నాటాలి అని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన ఇరువై రోజులుగా విత్తనాల బంతులు తయారీకి అటవీశాఖ అధికారులు, విఎస్ఎస్ సభ్యులు, ఇతరులకు గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం ను అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ విత్తనాల బంతులు తయారు చేసి రాష్ట్రం హరిత వనాలతో నిండి పోయేందుకు గ్రీన్

- 2లో

## సైకిల్‌పై హోంమంత్రి అనిత ప్రయాణం

### మొక్కలు నాటిన మంత్రి







**విజయవాడ,కలంకౌంటర్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. రామవరప్పాడు రింగ్‌లోని ఎస్ఎల్‌వీ గ్రీన్ మెడోస్ నివాసం నుంచి ఆటోనగర్‌లోని ఫైర్ స్టేషన్ కార్యాలయం వరకు ఆమె సైకిల్‌పై వెళ్లారు. అనంతరం ఫైర్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత రాష్ట్ర ప్రజలకు పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని హోంమంత్రి పేర్కొన్నారు. చెట్ల పెంపకం పర్యావరణాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం "నో వెహికల్ డే"గా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా పాటించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడటమే భావితరాలకు మనం అందించే గొప్ప ఆస్తి అని ఆమె అన్నారు. సైకిల్‌పై ప్రయాణించడం గర్వకారణమని, సైకిల్ వినియోగం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన తొలి రోజునే విజయవాడ నగర వీధుల్లో సైకిల్‌పై తిరగడం ఎంతో ఆనందంగా ఉందని హోంమంత్రి తెలిపారు. జీవితం చాలా చిన్నదని, ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం గంట సమయాన్ని తమ ఆరోగ్యం కోసం కేటాయించాలని సూచించారు. సైకిల్ వినియోగాన్ని పెంచడంతో పాటు బ్యాటరీ వాహనాల వినియోగాన్నీ ప్రోత్సహించాలని హోంమంత్రి అనిత ప్రజలకు పిలుపునిచ్చారు.



# ప్రతి చెట్టు వాతావరణ మార్పుల ప్రభావం నుంచి భూమిని కాపాడుతుంది

–అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

● రూ.3.30లక్షలతో గురుకులంలో అనంత అరణ్య మొక్కల పెంపకం ప్రారంభించిన ఎమ్మెల్యే





**మోపిదేవి,కలంకౌంటర్ :** ప్రతి చెట్టు వాతావరణ మార్పుల ప్రభావం నుంచి భూమిని కాపాడుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం మోపిదేవిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనంత అరణ్య మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారు. రూ. 3.30లక్షలతో 15సెంట్ల స్థలంలో 915 ఔషధ, పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు నాటే ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలను ఆరోగ్యవంతమైన, పచ్చని పాఠశాల ప్రాంగణాలుగా సృష్టించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, ఇంచార్జి ఎంపీపీ నడకుదుటి జననీకుమారి, టీడీపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, ఎంపీడీఓ జే.స్వర్ణభారతి, ఏ.ఎస్.డబ్ల్యూ.ఓ పర్వీన్ సుల్తానా, ఎంఈఓలు శివశంకర్, జీ.ఎన్.బీ గోపాల్, ప్రిన్సిపాల్ వీరరవి, ఏపీఓ టీవీఎన్ ముత్యాలు, ఉపాధ్యాయులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా సైకిల్ పర్యటన

● పద్మావతి నగర్ లేఔట్‌ను పరిశీలించిన తుడా ఛైర్మన్ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి



**తిరుపతి,కలంకౌంటర్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తుడా ఛైర్మన్,తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి వినూత్నంగా వ్యవహరించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ఆయన కూటమి నాయకులతో కలిసి సైకిల్ పర్యటన చేపట్టారు. తుకివాకం పద్మావతి నగర్ లేఔట్ ఆర్చ్ వద్ద ప్రారంభమైన సైకిల్ పర్యటన సురప్పకశం పద్మావతి నగర్ లేఔట్ వరకు ఉత్సాహంగా కొనసాగింది. సుమారు 3 కిలోమీటర్ల మేర సైకిల్‌పై ప్రయాణించిన తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పద్మావతి నగర్ లేఔట్‌లోని అభివృద్ధి పనులను, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వాహన కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డా॥డాలర్స్ దివాకర్ రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు.



తిరువూరు మండలం చిట్టేల గ్రామంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన మాజీ సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు.. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు..

**–తిరువూరు,కలంకౌంటర్ :**

# రాష్ట్రంలో ఆక్వా రంగాభివృద్ధికి ఎకో సిస్టం..

● 6 ప్రాంతాలు కలుపుతూ కారిడార్ ● బ్లూ ఎకానమీతోనే భవిష్యత్ ఆర్థికాభివృద్ధి సాధ్యం ● కేంద్ర మత్స్య శాఖ ప్రాంతీయ కార్యాలయానికి 15 రోజుల్లో భూకేటాయింపులు ● దేశాన్ని అగ్రపథాన నిలిపేలా అద్భుతంగా పని చేస్తున్న ప్రధాని మోదీ ● సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్ షాప్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ● కేంద్ర మంత్రులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన సీఎం ● రూ.72 కోట్లతో కాకినాడ పోర్ట్ ఆధునీకరిస్తామన్న కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్



**విశాఖపట్నం,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆక్వా రంగానికి భారతదేశం లైట్ హౌస్‌లా ఉంటే... దానికి ఏపీని కేంద్ర బిందువు చేస్తామన్నారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఆక్వా కారిడార్ అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ కారిడార్లో ఆక్వా అభివృద్ధికి అవసరమైన రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్స్, టెక్నాలజీని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అతి తక్కువ వ్యయంతో అత్యధిక ఉత్పత్తి సాధించడమే లక్ష్యమని చెప్పారు. ఆక్వా ఉత్పత్తులకు సంబంధించిన ఉప ఉత్పత్తులతో కూడా ఆర్థిక ప్రగతి సాధించవచ్చన్నారు. శుక్రవారం విశాఖలో జరిగిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్ షాప్‌లో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఆంధ్రా ష్రింప్, ఇండియా సీ-ఫుడ్' బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తున్నామని చెప్పారు. ఆక్వా రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన నాలుగు శాఖలకు చెందిన కేంద్ర మంత్రులు ఒకే వేదికపై రావడం శుభపరిణామంగా అభివర్ణించారు.

**రాష్ట్రంలో మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు..** 'రూ. 72 కోట్లతో కాకినాడ పోర్ట్ మోడ్రనైజేషన్ చేపడతామని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించినందుకు సంతోషం. కేంద్ర మత్స్య శాఖకు ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15 రోజుల్లో కేటాయిస్తాం. నెల రోజుల్లో కార్యాలయానికి శంకుస్థాపన చేసి నిర్మాణం ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతున్నాను. ఆక్వా ఉత్పత్తులను మరింత పెద్ద స్థాయిలో ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రం తీసుకునే చర్యలకు రాష్ట్రం వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుంది. మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తామని ఇప్పటికే చెప్పింది. వికసిత్ భారత్ లక్ష్యాలు చేరుకోవడానికి బ్లూ ఎకానమీ ఎంతో కీలకం. పాండ్ టు పోర్టు, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్, బ్లూ ఎకానమీ టు వికసిత్ భారత్ అనే విధానంతో పని చేయాలి. భారత ఆశలను... ఆశయాలను నెరవేర్చేందుకు ఏపీ బ్లూ ఎకానమీ దోహదపడుతుందని భావిస్తున్నా. ప్రపంచ వ్యాప్తంగా జరిగే సీ-ఫుడ్ బిజినెస్‌లో ఇండియా వాటా కేవలం 5 శాతం మాత్రమే ఉంది. ఈ రంగంలో ఇండియాకు పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏటా రూ.28,000 కోట్ల ఎగుమతులు..** 'భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదే. బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్న చోట నాగరికతలు విలసిల్లుతాయి... ఏపీలో గోదావరి, కృష్ణ వంటి జీవ నదులు ఉన్నాయి. సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఏపీ రెండో అతి పెద్ద రాష్ట్రం. 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఉత్పత్తి ఏపీలో జరుగుతోంది. ఏపీలో బ్లూ ఎకానమీ పెరిగితే... దేశ ప్రగతికి దోహద పడుతుంది. భారతదేశం మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతంగా ఉంది. భారతదేశం మొత్తం రొయ్యల ఉత్పత్తిలో ఏపీ షేర్ 66 శాతం. భారతదేశం మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో దాదాపు ఏపీ నుంచే 38 శాతం ఆదాయం వస్తోంది. సంవత్సరానికి రూ. 28,000 కోట్లకు పైగా సముద్ర ఆహార ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే, భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులు కూడా అభివృద్ధి చెందుతాయి. ఆక్వా రంగంలో ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు చేస్తే, భారతదేశ బ్లూ ఎకానమీ నిస్సందేహంగా ముందుకు సాగుతుంది. ఏపీలో 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. ఏపీకి పోర్టులు, ఎయిర్ పోర్టులు ఉన్నాయి. ఏ రంగం, ఏ ఉత్పత్తి అయినా సక్సెస్ కావాలంటే క్వాలిటీ, సస్టైనబుల్టీ, ట్రేసబులిటీ, ఇన్నోవేషన్, జీరో పొల్యూషన్ అనేది ముఖ్యం. సీ-ఫుడ్ ఎగుమతుల అభివృద్ధికి ప్రతీ స్టేక్ హోల్డర్ బాధ్యత తీసుకోవాలి, సహకరించాలి.' అని సీఎం అన్నారు.

**ప్రధాని మోదీని మరింత బలపరుద్దాం..** 'ఆక్వా పరిశ్రమలో ఇన్నోవేషన్లు చేసే వారిని ఆంధ్రప్రదేశ్ ఆహ్వానిస్తోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ఏపీ పని చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడితే.. ఆ పెట్టుబడులకు ప్రోత్సాహమిచ్చి... అభివృద్ధి చేస్తాం. ఆక్వా ఉత్పత్తులతో చక్కటి ఆరోగ్యం లభిస్తుంది. ప్రజలు ఇప్పుడు ప్రొటీన్ ఉత్పత్తులనే ఆహారంగా తీసుకుంటున్నారు. ఆక్వా ఉత్పత్తుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. ప్రొటీన్ ఫుడ్ తీసుకోవడంతోపాటు... ప్రతీ రోజూ సైక్లింగ్ చేయాలి. ఇవాళ ఈ సమావేశానికి సైకిలింగ్ చేసుకుంటూనే వచ్చాను. సైకిలింగ్ ద్వారా ఆరోగ్యం బాగుంటుంది... ఖర్చులూ తగ్గుతాయి. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. సరైన సమయంలో సరైన నేత నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండటం అదృష్టం. 21వ శతాబ్దం నరేంద్ర మోదీదే... భవిష్యత్తులో భారత దేశాన్ని అగ్ర భాగంలో నిలపడానికి ప్రధాని మోదీ అద్భుతంగా పని చేస్తున్నారు. ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న మోదీని మరింత బలపర్చాల్సిన అవసరం ఉంది.

# రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

తెచ్చేలా విశాఖలో సీఎం సైకిల్‌పై ప్రయాణించారు. ఎర్రటి ఎండ కాస్తున్నా.. సీఎం ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్ నుంచి 3 టౌన్ పీఎస్ జంక్షన్, పోలమాంబ గుడి, వుడా పార్క్, వైఎంసీఏ, బీచ్ రోడ్ మీదుగా నోవోటెల్‌కు సైకిల్‌పై వెళ్లారు. మొత్తం ఐదున్నర కిలోమీటర్ల దూరాన్ని 21 నిమిషాల్లోనే చేరుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు సైకిల్ ర్యాలీలో కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# విత్తనాల బంతులతో పచ్చదనం పెంపొందించుదాం



(మొదటిపేజీ తరువాయి)

క్లైమేట్ టీం ఎన్జిఒ. సహకారం అందించాలని కోరారు. విభిన్న రకాల విత్తనాలు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయన స్వయంగా విత్తనాల బంతులు తయారు చేయడం జరిగింది. అలాగే విద్యార్థులతో 1,000 అంకుడు మొక్కలు నాటించారు. అనంతరం డ్రోన్ లతో విత్తనాలు, విత్తనాల బంతులు చల్లే కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మైలవరం శాసన సభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ గారు, అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పి. సి.సి .ఎఫ్. పీవీ చలపతిరావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మల్లిఖార్జునరావు, ఎన్.టి.ఆర్. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ , అటవీశాఖ కు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణ

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ● బీసీ హాస్టళ్లు, గురుకులాలకు గ్రేడింగ్ ● గ్రేడింగ్ ఆధారంగా బదిలీలు, పదోన్నతులకు ప్రాధాన్యం ● త్వరలో 1,291 పారిశుధ్య సిబ్బంది నియామకం ● 142 మంది కుక్, కుమాటీలను కూడా... ● బీసీ హాస్టళ్లకు సచివాలయాల సిబ్బంది ● 224 మంది వీఆర్వోలు, మహిళా పోలీసులకు డిప్యూటేషన్ ● 6 ఎంజేపీ స్కూళ్లకు జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ ● బీసీ విద్యార్థుల కోసం 2 ఎక్స్ లెన్స్ సెంటర్ల ఏర్పాటు ● 1400 మందికి ఐఐటీ, నీట్ శిక్షణ ● బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం : మంత్రి సవిత ● వార్డెన్లు, ఎంజేపీ ప్రిన్సిపాల్లతో మంత్రి సవిత వీడియో కాన్ఫరెన్స్



**అమరావతి,కలంకౌంటర్ :** ఆరోపణలకు తావివ్వకుండా రాష్ట్రంలో బీసీ హాస్టళ్లు, గురుకులాలను పకడ్బందీగా నిర్వహించాలని, పనితీరు ఆధారంగా వాటికి గ్రేడింగ్ లు ఇవ్వనున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. గ్రేడింగ్ ఆధారంగా భవిష్యత్తులో చేపట్టబోయే బదిలీలు, పదోన్నత్తుల్లో ప్రాధాన్యమివ్వనున్నట్లు వెల్లడించారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని, దీనిలో భాగంగా త్వరలో 1,291 పోస్టులు భర్తీ చేయనున్నామని తెలిపారు. కొత్తగా 142 మంది కుక్, కమాటీలను నియమించనున్నామని, సచివాలయాల నుంచి 224 మంది వీఆర్వోలను, మహిళా పోలీసులను డిప్యూటేషన్ ప్రభుత్వం హాస్టళ్లకు కేటాయించిందని తెలిపారు. ఈ నెల 12 నుంచి ప్రారంభం కాబోయే నూతన విద్యా సంవత్సరం సందర్భంగా హాస్టళ్లను, గురుకులాలను సిద్ధం చేయాలని, పరిసరాలను, మరుగుదొడ్లను, తాగునీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాలకు చెందిన హాస్టల్ వార్డెన్లు, ఎంజేపీ స్కూళ్ల ప్రిన్సిపాల్లు, ఏబీసీడబ్ల్యూవోలు, డీబీసీడబ్ల్యూవోలతో మంత్రి సవిత శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 12 నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీ హాస్టళ్లను, ఎంజేపీ గురుకులాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎలుకలు, బొద్దింకలు, ఇతర కీటకాలు రాకుండా హాస్టళ్లు, గురుకులాల పరిసరాలతో పాటు తరగతి గదులు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లను, బాత్ రూమ్ లను శుభ్రం చేయాలన్నారు. దోమలు చొరబడకుండా ఉండేలా తరగతి, విశ్రాంతి గదుల ద్వారాలకు, కిటికీలకు దోమ తెరలు తక్షణమే అమర్చాలన్నారు. ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుతో పాటు నూతన మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి సవిత ఆదేశించారు.

**త్వరలో 1,291 పారిశుధ్య సిబ్బంది నియామకం..** కూటమి ప్రభుత్వం బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణకు అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత తెలిపారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారంతో పాటు ఆరోగ్య రక్షణకు పెద్దపీట వేస్తోందన్నారు. దీనిలో భాగంగా త్వరలో 1,291 పారిశుధ్య సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. ఈ నియామకాలకు సంబంధించిన ప్రక్రియను ఇప్పటికే చేపట్టామన్నారు. హాస్టళ్లు, గురుకులా పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తద్వారా విద్యార్థుల ఆరోగ్య రక్షణకు వీలుకలుగుతుందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా హాస్టళ్లు, గురుకులాలకు వచ్చే విద్యార్థులకు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని స్పష్టంచేశారు. బయట ఆహారం లోపలికి తీసుకురావొద్దని, దీనివల్ల విద్యార్థుల ఆరోగ్యం చెడిపోయే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలపాలని మంత్రి సవిత సూచించారు.

**142 కుక్, కమాటీ పోస్టులు..** ప్రభుత్వమందించే మెనూ సక్రమంగా అమలు చేయడంతో పాటు రుచికరమైన భోజనం అందించడానికి 142 కుక్, కమాటీ పోస్టులు త్వరలో భర్తీ చేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఖాళీలు, ఆయా హాస్టళ్లలో ఖాళీలను బట్టి కుక్ లు, కమాటీలను నియమిస్తామ న్నారు. 224 మంది సచివాలయాల సిబ్బందిని డిప్యూటేషన్ పై బీసీ హాస్టళ్లలో తీసుకోనున్నట్లు వెల్లడించారు వారిలో 126 మంది వీఆర్వోలను, 98 మంది మహిళా పోలీసులు ఉన్నారన్నారు. వారికి హాస్టళ్ల నిర్వహణ, ఇతర అంశాలపై రెండ్రోజుల పాటు శిక్షణ కూడా ఇవ్వనున్నామన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల హాస్టళ్లకు ధీటుగా బీసీ విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా హాస్టళ్లను, గురుకులాలను సిద్ధం చేస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద కిచెన్ గార్డెన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా హాస్టళ్లు, గురుకులాల్లో ఉంటే ఖాళీ ప్రదేశాల్లో కూరగాయల పెంపుదల చేపట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం చేపట్టాలని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**పనితీరు ఆధారంగా గ్రేడింగ్..** హాస్టళ్లు, గురుకులాల పనితీరు ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. బోధన, నిర్వహణ, మెనూ అమలు, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని గ్రేడింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. హాస్టళ్ల వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాళ్ల బదిలీలు, పదోన్నతుల కల్పనలో ఈ గ్రేడింగ్ ను పరిగణలోకి తీసుకోనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకోవాలన్నారు. వేసవి సెలవుల తరవాత హాస్టళ్లు విద్యార్థులు వస్తున్నారని, సహజంగానే వారికి ఇంటిపై బెంగ ఉంటుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు మనో ధైర్యం కలిగేలా వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. బెదిరింపులు, హెచ్చరికల ధోరణులతో కాకుండా స్నేహపూర్వకంగా మెలగాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు.

**6 ఎంజేపీలు కళాశాలలుగా అప్ గ్రేడ్..** రాష్ట్రంలో ఆరు ఎంజేపీ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు మంత్రి సవిత తెలిపారు. త్వరలో ప్రారంభం కాబోయే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించనున్నామన్నారు. ఆత్మకూరు, వనిపెంట, నరసన్నకోట, గొలగమూడి, కొత్తవలస, కలికిరి ఎంజేపీ స్కూళ్లను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామన్నారు. బీసీ విద్యార్థులకు ఐఐటీ, నీట్ కు శిక్షణిచ్చేలా రెండు ఎక్స్ లెన్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 1400 మంది విద్యార్థులతో ఈ రెండు సెంటర్లను ఈ విద్య సంవత్సరం నుంచే ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా మరో పది ఎంజేపీ స్కూళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, త్వరలో వాటి ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతి రానుందని తెలిపారు. ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ లో ఎంజేపీ, బీసీ హాస్టళ్ల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారంటూ సిబ్బందని అభినందించారు. రాబోయే టెన్త్, ఇంటర్ లోనూ అత్యుత్తమ ఫలితాల సాధించడానికి ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మంత్రి సవిత సూచించారు.

**ఆరోపణలకు తావివ్వొద్దు...** హాస్టళ్లు, గురుకులాల నిర్వహణలో ఎటువంటి ఆరోపణలకు, అవకతవకలకు తావివ్వొద్దని మంత్రి సవిత హెచ్చరించారు. గతేడాది కొన్ని విమర్శలు కొందరిపై వచ్చాయని, అవి సరికాదని స్పష్టం చేశారు. కొందరి వల్ల మొత్తం వ్యవస్థపైనే విమర్శలు, ఆరోపనలు రావడం సరికాదని, అటువంటి వారిని ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా, బీసీ హాస్టళ్లు, గురుకులాల నిర్వహణకు సకాలంలోనే నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు లక్ష్య సాధనలో అందరూ భాగస్వాములు కావాలని మంత్రి సవిత తెలిపారు.







**విజయవాడ క్యాంపు కార్యాలయం నుండి అమరావతి సచివాలయం కు సైకిల్ పై వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడు**

**–అమరావతి,కలంకౌంటర్ :**

# ప్లాస్టిక్ రహిత తిరుపతి స్థాపనకు అందరూ సహకరించాలి..

–కమిషనర్ (ఎఫ్.ఏ.సి.)శారదా దేవి.







**తిరుపతి,కలంకౌంటర్ :** ప్లాస్టిక్ రహిత తిరుపతి స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా శుక్రవారం ఉదయం నగరంలోని జీవకోన నందు పారిశుధ్య పనుల నిర్వహణ, రైతు బజార్ నందు పారిశుధ్య పనులతో పాటు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించి పర్యావరణ హితమైనవి వినియోగించాలని పిలుపునిచ్చారు. నగరంలో ఎక్కడైనా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని కాలువలు, నాలాలు శుభ్రం చేస్తున్నామని తెలిపారు. ఏ కాలువలో చూసినా ప్లాస్టిక్ కవర్లలో కట్టి వేసిన చెత్తచెదారం వస్తోందని తెలిపారు. కాలువల్లో చెత్త వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య సిబ్బంది అన్ని ప్రాంతాల్లోని కాలువల్లో మట్టి, చెత్త తొలగించాలని తెలిపారు. రుతుపవనాల వలన కురిసే వర్షాలతో రోడ్లపై నీరు నిలవకుండా సజావుగా వెళ్లేలా తగుచర్యలు చెపట్టాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.మహేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, పారిశుధ్య విభాగపు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





సైకిల్ తొక్కిన మంత్రి సవిత, ఎం ఎల్ ఏ గద్దె రామోహన్.

–విజయవాడ,కలంకౌంటర్ :

# మొక్కలు నాటడాన్ని అలవాటుగా మార్చుకోండి

- ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించండి
- పర్యావరణ దినోత్సవం రోజున పిలుపునిచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి
- కందుకూరులో సైకిల్ యాత్ర చేసిన ఎమ్మెల్యే, అధికారులు




**కందుకూరు,కలంకౌంటర్ :** ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటడం అలవాటుగా చేసుకుని, పర్యావరణాన్ని కాపాడాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, కందుకూరు పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ యాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ అనూష, ఇతర అధికారులు, కూటమి పార్టీల నేతలతో కలిసి మున్సిపల్ కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు సైకిల్ తొక్కారు. వీలున్నంతవరకు మోటారు వాహనాల వినియోగం తగ్గించేందుకు ప్రయత్నించాలని ప్రజలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం మొక్కలు నాటారు.ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ.... తమ చిన్నతనంలో పర్యావరణం సమతుల్యంగా ఉండి సకాలంలో వర్షాలు కురిసేవని గుర్తు చేసుకున్నారు. రాను రాను ఉష్ణోగ్రతలు పెరిగిపోవడానికి, పచ్చదనం తగ్గిపోవటమే కారణమన్నారు. రకరకాల కారణాలతో చెట్లను విపరీతంగా కొట్టివేయడం వల్ల, మనకు మనమే నష్టం చేసుకుంటున్నామని ఎమ్మెల్యే అన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిందని, ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే శాపంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెబుతూ... మొక్కలు ఎక్కువగా నాటాలని పిలుపునిచ్చారు. అలాగే వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు. కేవలం పర్యావరణ దినోత్సవం రోజున మాత్రమే కాకుండా, మిగిలిన రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తిని పాటించాలన్నారు. అటు పర్యావరణం, ఇటు పొదుపు చర్యల్లో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం అనేక జాగ్రత్తలు తీసుకుంటుందని ఎమ్మెల్యే చెప్పారు. ప్రభుత్వ పెద్దలు, మంత్రులు, అధికారులు కూడా వాహనాలను పరిమితంగా ఉపయోగిస్తూ ప్రజలకు మంచి సందేశాన్ని ఇస్తున్నారని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ హిమవంశీ మాట్లాడుతూ... ప్రస్తుతం నమోదవుతున్న ఉష్ణోగ్రతలకు అందరూ ఇబ్బందులు పడడం చూస్తున్నామని, ఏడాదికేడాది అవి పెరుగుతూనే ఉన్నాయన్నారు. వాటి నుంచి ఉపశమనం పొందడానికి కొత్తగా మొక్కలు నాటడంతో పాటు, ఉన్న చెట్లను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామని మున్సిపల్ కమిషనర్ అనూష తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గంజాయి డిటెక్షన్ కిట్స్" ద్వారా గంజాయి సేవించే వ్యక్తులను గుర్తిస్తున్న పోలీసులు

–జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** జిల్లాలో గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కఠిన చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్న గంజాయి వినియోగంను అరికట్టేందుకు ఇటీవల జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు " గంజాయి డిటెక్షన్ కిట్లను" పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ గంజాయి డిటెక్షన్ కిట్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించబడ్డాయని, మూత్ర పరీక్ష ద్వారా కేవలం ఒక నిమిషంలోనే వ్యక్తి గంజాయి సేవించాడా లేదా అని నిర్ధారణ చేయవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ నేపథ్యంలో గంజాయి సేవించేవారిని గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు, యాంటి గంజాయి టీం మరియు ఈగల్ టీం సభ్యులు గంజాయి డిటెక్షన్ కిట్లతో పరిక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా 11మందికి పరిక్షలు నిర్వహించగా, 7 మందికి పాజిటివ్ వచ్చిందని, వారు గంజాయి సేవించారని నిర్ధారణ అయిందని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ తెలిపారు. పాజిటివ్ వచ్చిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, వారికి గంజాయి ఎక్కడనుండి వచ్చిందన్న వివరాలను సేకరించి బ్యాక్వార్డ్ లింకులను ఛేదిస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – గంజాయి మరియు డ్రగ్స్ సమాజానికి, ముఖ్యంగా యువతకు తీవ్రమైన ప్రమాదంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గంజాయి వినియోగం గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎవరైనా గంజాయి కలిగివున్నా, సేవించినా, రవాణా చేసినా వారిపై కఠిన చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో గంజాయి సేవించే వారికి చెక్ పెట్టేందుకు గంజాయి డిటెక్షన్ కిట్లను వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా 11మందికి పరిక్షలు నిర్వహించగా, 7 మందికి పాజిటివ్ వచ్చిందని, వారు గంజాయి సేవించారని నిర్ధారణ అయిందని జిల్లా ఎస్పీ తెలిపారు. త్వరలో రౌడీ షీటర్లకు మరియు గంజాయి సేవించేవారికి జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున కౌన్సిలింగ్ నిర్వహించి వారు "పరివర్తన" చెందేవిధంగా చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. గడిచిన 9 నెలల కాలంలో 26 గంజా కేసులు నమోదుచేసామని, 116 మంది నిందితులను అరెస్ట్ చేసామని, 377 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని, 8 మందిపై పిట్ ఎన్డీపిఎస్ చట్టం, ఇద్దరు వ్యక్తులపై పీ.డి.యాక్ట్ క్రింద సంవత్సర కాలంపాటు జైలుకు తరలించామని, 37 మందిపై సస్పెక్ట్ షీట్లు తెరిచి నిఘా ఉంచామని తెలిపారు. అదేవిధంగా గంజాయి వ్యాపారం ద్వారా ఆస్తులు సంపాదించిన వారిని గుర్తించి వారి ఆస్తులను కూడా జప్తు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు, పదార్థాలు లేదా గంజాయికి సంబంధించిన కార్యకలాపాలు కనిపించిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయిల్ 100/112 లేదా 1972కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు. జిల్లాలో గంజాయి నియంత్రణ కోసం పోలీస్ , ఈగల్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గారు తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, మరియు ఇతర అనుమానాస్పద ప్రదేశాల్లో తరచూ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెంచినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్ పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు కఠినతరం చేశామని చెప్పారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు మరియు ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో కూడా పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు.

# బ్రాహ్మణ సంఘం చేయూత



**కావలి,కలంకౌంటర్ :** బ్రాహ్మణ మహా సంఘం కావలి అధ్యక్షుడు పి వీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల పాత ఊరు నందు శుక్రవారం కొప్పోలు మాలతి కి వైద్య సహాయం నిమిత్తం 15 వేలు దా తల సహకారంతో అందించారు.ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ నందనవనం మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి ఏవి. రమణమూర్తి, ట్రెజరర్ ఆర్. వి .కళాధర్ రావు, ప్రాంతీయ కార్యదర్శి తెలికేపల్లి రమేష్, ఈసీ సభ్యులు గురు కృష్ణ, పాల్గొన్నారు.

# పిల్లలే దేశ సంపద



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** పిల్లలే దేశ సంపదని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పసితనం నుంచే వారిని తీర్చిదిద్దే అద్భుత అవకాశం తల్లిదండ్రులతో పాటు అంగన్వాడీలకే దక్కుతుందని మండలంలోని చిన్న ఓగిరాల గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ తేజస్విని అన్నారు. కంకిపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఉయ్యూరు మండలం ఆకునూరు సెక్టార్ కాటూరు కెఆర్జెడ్ పి హెచ్ స్కూల్ నందు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ తేజస్విని ముఖ్య అతిథిగా హాజరై 0 – 3 సంవత్సరాల పిల్లలలో మెదడు అభివృద్ధి 80 శాతం జరుగుతుందని పిల్లల్లోని అభివృద్ధి కీలక పరిణామాల గురించి తెలియజేశారు. ఈ నవ చేతన యాప్ ద్వారా పిల్లలను స్క్రీనింగ్ చేసి వారిలో ఏమైనా వైకల్యాలను గుర్తించి వారిని సాధారణ పిల్లలుగా మారేటట్టు చేయవచ్చని తెలియజేశారు . 4 డిఎస్ లు అంటే డిఫెక్ట్స్, డెఫిషియన్సీ, డిసీజెస్, డిలేస్, ఆటిజం అని వివరించారు. సూపర్వైజర్ బి బేబీ సరోజినీ పిల్లల్లోని ఐదు అభివృద్ధి విభాగాల గురించి వివరించారు .సూపర్వైజర్ రాఘవమ్మ స్క్రీనింగ్ చేసేటప్పుడు బిడ్డను పూర్తిగా గమనించి ఎలా చేయాలి అనేది తెలియజేశారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** భవిష్యత్ తరాల ను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పట్ల బాధ్యతతో వ్యవహరించాలని ఉయ్యూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జిఎస్వి శేషగిరిరావు రూరల్ ఎస్సై కే సురేష్ లు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కడవకొల్లు గ్రామంలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది కలసి శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భముగా ఎస్సై .సురేష్, మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక భాధ్యత అని పేర్కొన్నారు. ఎంపీడీవో మాట్లాడారు. కలవపాముల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో శివశంకర్ పాల్గొన్నారు.

# శిశువుల ఎదుగుదలపై అవగాహన పెంచుకోవాలి - డాక్టర్ శ్రీ లక్ష్మి.



**కావలి,కలంకౌంటర్ :** సమాజంలో శిశువుల ఎదుగుదలపై తల్లులకు అవగాహన కల్పించాలని ఆరోగ్యంగా జీవించడానికి కృషి చేయాలని పుల్లారెడ్డి నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం. శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పుల్లారెడ్డి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో వెంగళరావునగర్ పాత ఊరు వైకుంటపురం పుల్లారెడ్డి నగర్ అర్బన్ హెల్ప్ సెంటర్ల ఏఎన్ఎంలు ఆశా వర్కర్లకు నవచేతన కార్యక్రమం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించినారు. వైద్యాధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలు ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు తరచుగా శిశువుల నివాసాలకు వెళ్లి వాళ్ళు ఎదుగుదలకు ఆరోగ్య సలహాలు సూచనలు ఇచ్చి వారి సంపూర్ణ ఆరోగ్యశీ గా ఎదగడానికి నిరంతరం కృషి చేయాలని కోరినారు. ఈ కార్యక్రమానికి అతిథిగా కావలి డివిజన్ లింగ నిర్ధరణ నిషేధ సలహా కమిటీ సభ్యులు ఎం. మాల కొండారెడ్డిమాట్లాడుతూ శిశువుల ఆరోగ్యం ఎదుగుదలపై తరచుగా వైద్య సిబ్బంది గ్రామాలు గాని కాలనీలు గాని సందర్శించి తల్లి బిడ్డ ఆరోగ్యంగా జీవించడానికి వైద్య సలహాలు ఇచ్చిసమతుల్యమైన ఆహారం అలవాట్లను ప్రోత్సహించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో మలేరియా నివారణ సబ్ యూనిట్ అధికారి లక్ష్మీనరసయ్య హెల్త్ సూపర్వైజర్ ఝాన్సీ మరియు ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన బిజెపి శ్రేణులు



**కావలి,కలంకౌంటర్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ కావలి ఒకటవ పట్టణశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ప్రాంగణంలో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కావలి ఒకటవ పట్టణ అధ్యక్షులు మంద కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ విపత్తుల నుండి భూమిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని కోరారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) అనే అద్భుతమైన సంకల్ప స్ఫూర్తితో.. ప్రతి ఒక్కరూ తమ తల్లిపై ఉన్న ప్రేమకు గుర్తుగా, భావితరాల భవిష్యత్తు కోసం కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని బాధ్యతగా సంరక్షించాలని పిలుపునిచ్చారు. .ఈకార్యక్రమంలో జిల్లా టెలికం అడ్వైజర్ కమిటీ సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ మాల్యాద్రి,కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సన్నగంటి సీనయ్య, జిల్లా కోశాధికారి సీవీసీ సత్యం, జివిస్టి మండలి సభ్యులు అమరా వెంకట సుబ్బారావు, ఎస్సీ మోర్చా మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు పట్టణ ప్రధాన కార్యదర్శి గుడిపల్లి ప్రసన్నకుమార్, సీనియర్ నాయకులు వల్లెపు తిరుపతయ్య, వాయగండ్ల వెంకట సుధీర్, కిసాన్ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి మంగమూరు వెంకటరెడ్డి, మేదరమెట్ల మణిదీప్,శ్రీనిక్ కుమార్, దేవాండ్ల రాకేష్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం పరిశుభ్రత మన జీవితంలో ఎంతో ప్రాధాన్యత

–డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఆపరేషన్ క్లీన్ స్వీ పు కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45 డివిజన్ నందు శుక్రవారం బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ తదితరులతో పాటుగా డీసీఎంఎస్ చైర్మన్, జనసేన పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ , బండి రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, గొర్రెపాటి గోపీచంద్ లు పాల్గొని జిల్లా జడ్జి బంగ్లా ముందు గల డ్రైనేజీ ను పర్యవేక్షించి, పలు డ్రైనేజీ ల నందు గల పూడిక తీసి, రోడ్లు ఊడ్చి, ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సచివాలయం ముందు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. పచ్చదనం , పరిశుభ్రత మన జీవితంలో ఎంతో ముఖ్యమైనవి అన్నారు. పచ్చదనం అంటే చెట్లు, మొక్కలు ప్రకృతి సంపదలను పెంపొందించడం అన్నారు. చెట్లు మనకు ప్రాణవాయువును అందించి వాతావరణాన్ని స్వచ్ఛంగా ఉంచుతాయి, అలాగే భూగోళ ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో కూడా ముఖ్య పాత్ర పోషిస్తాయి అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంచాలి అన్నారు. పరిశుభ్రత అనేది ఆరోగ్యకరమైన జీవితానికి పునాది. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చు అన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వెయ్యకుండా చెత్తబుట్టలో వేసి శానిటేషన్ సిబ్బంది వచ్చినప్పుడు అందించడం మన కర్తవ్యం అన్నారు. ప్రతి వ్యక్తి పచ్చదనం పెంపొందించడానికి, పరిశుభ్రతను పాటించడానికి తన వంతు బాధ్యతను నిర్వర్తించాలి అని, పచ్చదనం... పరిశుభ్రత అనే రెండు విలువలను ఆచరిస్తే ఆరోగ్యకరమైన అందమైన , సుస్థిరమైన సమాజాన్ని నిర్మించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ తో పాటుగా డివిజన్ స్వచ్ఛ సైనికులు, చలమలశెట్టి పోతురాజు, గంజాల రవికుమార్, సిద్దినేని అంజనీ దేవి, డివిజన్ సచివాలయ శానిటేషన్ సెక్రెటరీ, మాచవరపు మానస, సచివాలయ సిబ్బంది, డివిజన్ శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

- భవిష్యత్తు బాగుండాలంటే పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిందే
- పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా సముద్రంలో కలవనీయొద్దు
- ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్క నాటి సంరక్షించాలి
- మంగినపూడి బీచ్‌లో పర్యావరణ పరిరక్షణ దినోత్సవ వేడుకలో మంత్రి కొల్లు రవీంద్ర







**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మన భవిష్యత్తు బాగుండాలంటే నేడు పర్యావరణాన్ని కాపాడుకోవడం తక్షణ కర్తవ్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలోని మంగినపూడి బీచ్ వద్ద జిల్లా జాయింట్ కలెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, విద్యార్థులు, పార్టీ నాయకులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. బీచ్ పరిసరాల్లో పేరుకున్న చెత్తను తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను వేర్వేరుగా తరలించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని యువత, విద్యార్థులు, నాయకులతో ప్రమాణం చేయించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. పర్యావరణంలో అసమతుల్యం కారణంగానే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉష్ణోగ్రతలు పెరిగి ఇబ్బంది పడుతున్నాం. వర్షపాతంలో తేడాలొస్తున్నాయి. అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలకు పర్యావరణ అసమతుల్యమే కారణం. ఫలితంగా అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. మంగినపూడి బీచ్కు పర్యాటకులు ఎక్కువగా వస్తున్నప్పటికీ చెత్త పేరుకుపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా పేరుకుంటున్నాయి. ఆరోగ్యంగా ఉండాలంటే పర్యావరణం ఎంతో ముఖ్యం. వ్యర్థాలు సముద్రంలో పేరుకుపోవడం ద్వారా పర్యావరణానికి కనిపించని నష్టం జరుగుతోంది. పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు స్వచ్ఛందంగా పాల్గొనడం ఆనందంగా ఉంది. ఈ కార్యక్రమాన్ని ప్రతి నెలా జరిగేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తాం. ప్రతి పౌరుడు కూడా ఒక మొక్క నాటి బాధ్యతలు తీసుకోవాలి. పర్యావరణానికి హాని చేసే వస్తువుల వినియోగంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. గోదావరి పుష్కరాల సందర్భంగా పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చాం. అదే స్ఫూర్తితో కృష్ణా నదిలో కూడా వ్యర్థాల నిర్వహణ చేపడతాం. పరిశ్రమల నుండి వ్యర్థాలు నేరుగా సముద్రంలో కలవకుండా ఎస్టీపీలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. సముద్ర జీవాల పరిరక్షణలో ప్రతి ఒక్కరినీ భాగస్వాముల్ని చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# కళాశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** విద్యనభ్యసించిన కళాశాలకు తమ సహచర విద్యార్థి స్మారకార్థం లక్ష రూపాయలు విలువ చేసే వస్తువులు అందచేయడం అభినందనీయమని స్థానిక ఏజీఅండ్ ఎస్జి కళాశాల కన్వీనర్ తాతినేని శ్రీహరిరావు అన్నారు. 1975-1978 సంవత్సరాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు కలిసి వారితో పాటు విద్యనభ్యసించిన దివంగత విద్యార్థి, కళాశాల చరిత్ర విభాగం మాజీ అధిపతి ఆర్వీఎల్ నారాయణరావు స్మాకార్థం వాటర్ కూలర్, కంప్యూటర్, రెండు ప్రింటర్లు శుక్రవారం శ్రీహరిరావుకు అందచేశారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, తమకు విద్యాబోధన చేసిన గురువుల పట్ల కృతజ్ఞతా భావంతో, కళాశాల అభివృద్ధికి సహాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జిజెపి వినయ్ కుమార్, ప్రిన్సిపాల్ శివనాథ్, కెఎస్ఎన్ బెనర్జీ, వి రత్నబాబు, వి మురళి, లక్ష్మణరావు, ఉషారాణి పాల్గొన్నారు.

# పేదలపాలిట సంజీవని సీఎంఆర్ఎఫ్



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** అనారోగ్యం, ప్రమాదాలలో గాయపడి ప్రైవేట్ హాస్పిటల్లో వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్నవారికి ముఖ్య మంత్రి సహాయనిధి సంజీవని లాంటిదని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి ధరఖాస్తు చేసుకున్న ఆరుగురికి మంజూరైన రూ. 4.70లక్షల చెక్కులు శుక్రవారం ఆయన కార్యాలయంలో అందచేశారు. ఇబ్బందుల్లో ఉన్న పేదలకు అండగా నిలవడం తన బాధ్యతని, ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరు ఈపథకం సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ నాయకులు అజ్మతుల్లా, ఫణి, మాజీ కౌన్సిలర్ సలోమి తదితరులు పాల్గొన్నారు.

# ఈతతో పర్యావరణ సందేశం..

- కృష్ణమ్మ ఒడిలో కలెక్టర్ లక్ష్మీశ వినూత్న చైతన్య కార్యక్రమం
- జల వనరులు.. పర్యావరణ సమతుల్యతకు మూలాధారాలని వ్యాఖ్య



**విజయవాడ,కలంకౌంటర్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శుక్రవారం కృష్ణా నదిలో ఈ ఒడ్డు నుంచి అవతలి ఒడ్డుకు ఈదుతూ పర్యావరణ పరిరక్షణ, జల వనరుల సంరక్షణపై వినూత్న సందేశాన్ని ప్రజలకు అందించారు. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయవాడలోని దుర్గా ఘాట్ వద్ద నుంచి కలెక్టర్ నదిని ఈ ఒడ్డు నుంచి అవతలి ఒడ్డుకు ఈదుతూ పర్యావరణ పరిరక్షణలో జల వనరుల ప్రాధాన్యాన్ని చాటిచెప్పారు. అవతలి ఒడ్డున ప్రాంతంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నదులు కేవలం నీటి వనరులు మాత్రమే కాకుండా జీవ వైవిధ్యానికి, వ్యవసాయానికి, తాగునీటి అవసరాలకు, పర్యావరణ సమతుల్యతకు మూలాధారాలని పేర్కొన్నారు. నదులు స్వచ్ఛంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యం, ప్రకృతి ఆరోగ్యం సురక్షితంగా ఉంటాయని అన్నారు. ఈత అనేది ఆరోగ్యాన్ని పెంపొందించే ఉత్తమ వ్యాయామమని, ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున ఈత ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రకృతితో మమేకమవడం ద్వారా పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతాభావం పెరుగుతుందని చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, కాలుష్యం, నిర్లక్ష్య వైఖరి కారణంగా అనేక జల వనరులు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన కలెక్టర్.. ప్రతి పౌరుడు నదులు, చెరువులు, కాలువలను పరిశుభ్రంగా ఉంచేందుకు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

# విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల ముగింపు









**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నంలోని కేంద్ర గ్రంథాలయంలో ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ ముగింపు సభకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎంకే బేగ్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా కృష్ణా జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మరియు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ప్రాముఖ్యతను, విద్యార్థుల భవిష్యత్తుకు అవి ఎలా ఉపయోగపడతాయో ప్రముఖులు తమ ప్రసంగాల ద్వారా వివరించారు. గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలు: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎంకే బేగ్ సభకు అధ్యక్షత వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎంకే బేగ్ మాట్లాడుతూ, గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిలయాలు కావని, అవి సమాజ చైతన్యానికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులని కొనియాడారు. 40 రోజుల పాటు సాగిన ఈ వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు అద్భుతంగా సద్వినియోగం చేసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. డిజిటల్ యుగంలోనూ పుస్తక పఠనానికి ఉన్న విలువ తగ్గలేదని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాలను మరింత ఆధునీకరించి, పాఠకులకు అన్ని వసతులు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. వ్యక్తిత్వ వికాసానికి గ్రంథాలయాలే దిక్సూచి డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణా జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి వేసవి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. గ్రంథాలయాల్లో లభించే మహానుభావుల జీవిత చరిత్రలు, నైతిక విలువల పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థుల్లో ఉత్తమ వ్యక్తిత్వం అలవడుతుందని తెలిపారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి పుస్తక పఠనం ఎంతో అవసరమని, ప్రతి విద్యార్థి రోజులో కొంత సమయాన్ని గ్రంథాలయంలో గడపాలని ఆయన ఆకాంక్షించారు.

**విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు కేరాఫ్ అడ్రస్-లంకిశెట్టి బాలాజీ..** మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, చదువుతో పాటు లోకజ్ఞానం సంపాదించినప్పుడే జీవితంలో స్థిరపడగలమని, అందుకు గ్రంథాలయాలే సరైన వేదికలని పేర్కొన్నారు. నాడు ఎందరో మహానుభావులు గ్రంథాలయాల్లో చదువుకుని దేశానికి దిశా నిర్దేశం చేశారని గుర్తుచేశారు. కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఇలాంటి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.

**ఘనంగా సర్టిఫికెట్ల పంపిణీ..** ఈ ముగింపు సభలో వేసవి శిక్షణ తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చైర్మన్ ఎంకే బేగ్, అతిథులు బండి రామకృష్ణ, లంకిశెట్టి బాలాజీల చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ ,సహాయం వెంకటరమణ జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది , ప్రముఖులు సవరం వెంకటేశ్వరరావు మేడిశెట్టి యోగేశ్వరరావు కారుమూరి రాజేంద్ర ప్రసాద్, పోతురాజు మాస్టారు రాధికారాణి యోగా టీచర్ గీత స్వర్ణ లత అంబటిపూడి సుబ్రహ్మణ్యం విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com